# స్వానుభవం

**ఆ** రోజు అల్లీబిల్లీ వారం.

అంటే ఆదివారమన్న మాట. ఆదివారానికి మేము పెట్టుకున్న మరో పేరు అది. 'మేము' అంటే నేను, మా అక్కయ్య కూతుళ్ళు బన్నూ చిన్నూ.

ఒక ఆదివారం నాడు మేం ముగ్గురం ఏదో ఆటలాడుకుంటూంటే, అక్కయ్య "వాణీ – అలా అల్లీబిల్లీ ఆటలాడకపోతే, వాళ్ళిద్దరినీ కూర్చోబెట్టి చదువుచెప్పకూడదా?" అంది నాతో.

"ఆదివారం చదువు మాటెత్తకూడదు. హాయిగా ఆడుకోవాలంతే" కచ్చితంగా చెప్పేశాను.

"అవును ఇలా అల్లీబిల్లీ ఆటలే ఆడుకోవాలి" అంది బన్నూ నాకు సపోర్టుగా.

అప్పుడే ఆదివారమంటే అల్లీబిల్లీ వారం అని పేరు పెట్టుకున్నాం. నేను వచ్చేటప్పుడు బన్నూ, చిన్నూ "మళ్ళీ ఎప్పుడొస్తావు పిన్నీ" అని అడిగితే, నేను – "వచ్చే ఆది..." అని చెప్పబోతోంటే మధ్యలోనే ఆపేసి "తప్పుచెబుతున్నావు" అంటారు. "అవునవును" అని సరిదిద్దుకుని "వచ్చే అల్లీ బిల్లీ వారం వస్తా" అనగానే సరదాగా నవ్వేస్తారు.

అమ్మా నాన్నలను వదిలి మొదటిసారిగా హాస్టల్లో ఉండి కాలేజీలో చదువుకుంటున్నాను. ఇలా ఆదివారాలు అప్పుడప్పుడూ పర్మిషన్ తీసుకుని అక్కయ్య వాళ్ళింట్లో గడుపుతున్నాను కాబట్టే ఇంటి బెంగ కలగటంలేదు. అసలు అక్కయ్య వాళ్లింట్లోనే ఉండి చదువుకోమంది హాస్టల్ లైఫ్ కూడా రుచి చూడాలని నేనే ఒప్పుకోలేదు.

అక్కయ్య ఆప్యాయంగా చేసిపెట్టినవి తిని, బావగారు సరదాగా చెప్పే కబుర్లు వింటూ పిల్లలతో ఆడుకుంటూ సరదాగా గడిపే ఆదివారం అంటే నాకు ఎంతో ఇష్టం. హుషారుగా బయలుదేరాను అక్కా వాళ్ళింటికి.

నేను వెళ్ళేసరికి అక్క బావ కోసం ఎదురుచూస్తూ ఉంది. ఇద్దరూ కలిసి ఎవరో తెలిసిన వాళ్ళింటికి వెళ్ళాలనుకున్నారట. ఒక గంటలో వస్తానని బావ బయటకు వెళ్ళాడట. కానీ ఆరోజు బావ సాయంకాలం నాలుగింటి వరకూ రాలేదు. రాగానే అక్క రుసరుస లాడింది.

"గంటలో వస్తానని భోజనానికి కూడా రాకుండా, ఆదివారం నాడు కూడా ఊళ్ళో ఏం రాచకార్యాలు వెలగబెడ్తున్నట్లూ...?"

"ఫ్రెండొకడు తటస్థపడి బలవంతపెట్టి హోటల్‌కు లాక్కుపోయాడు." బావ సంజాయిషీ ఇచ్చాడు.

"ఎవరో ఆ ఫ్రెండు?" అక్క ధుమధుమ లాడ్తూనే ఉంది.

"ఆఁ... ఎవరో కుర్చీ స్నేహుతుడేలే, కుటుంబరావు" అన్నాడు బావ.

"అదేమిటి బావా? కుర్చీ స్నేహితులు, బెంచీ స్నేహితులు అంటూ ఉంటారా?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఎందుకుండరూ? ఆఫీసులో నా సీటుతో పని ఉండి పరిచయం కలిగిన వాళ్ళలో చాలామంది కుర్చీ స్నేహితులన్నమాట. ఆ కుర్చీలో నేనున్నాళ్ళూ నన్ను ఎంతో అభిమానిస్తారు. అట్టహాసంగా మర్యాదలు చేస్తారు. ఆ కుర్చీ నేను మారితే, ఎక్కడైనా కనబడితే హలో అంటూ ముక్తసరిగా పలకరింపులతో తప్పించుకుపోతారు.

ఇక చిన్నప్పుడు నాతో పాటూ బెంచీలపై కూర్చుని చదువుకున్న బాల్య స్నేహితులు బెంచీ స్నేహితులన్న మాట! ఈరోజు నాకు ఇద్దరూ తటస్థపడ్డారు. ఇందాక ఇంటికని బయలుదేరి వస్తోంటే, బెంచీ స్నేహితుడొకడు కనుపిస్తే వాడితో పాటు హోటల్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కాఫీ తాగి వస్తున్నా"

బావ ఇచ్చిన తమాషా వివరణకి నాకు నవ్వొచ్చింది.

"కుటుంబరావు అన్నయ్యని మాత్రం మీరు కుర్చీ స్నేహితుడంటే నే నొప్పుకోను. ఆయనకి మీతో పని ఉండి పరిచయం కలిగిన మాట నిజమే అయినా, ఆయనకి మీరంటేనే కాదు. మేమంటే కూడా ఎంతో అభిమానం. ఎప్పుడు వచ్చినా 'చెల్లెమ్మా కాఫీ కావాలమ్మా' అంటూ ఎంతో చనువుగా అడుగుతారు. 'నాకు చెల్లెళ్ళులేని లోటు తీరుస్తున్నావమ్మా' అంటారు. బన్నూ అంటే కూడా ఎంతో ఇష్టం. ఇక్కడున్నంతసేపూ దాన్ని ఒళ్ళో కూర్చోచెట్టుకుని దింపరసలు. దానికోసం ఏవో పళ్ళు, బిస్కెట్లు తేకుండా రారు. వద్దంటే వినరు. 'మీ ఆయనకి ప్రిన్సిపల్స్ ఉంటే ఉండనీయమ్మా. కానీ నా మేనకోడలికి తీసుకురావద్దనే హక్కు మాత్రం ఆయనకిలేదు' అంటారు".

అక్కయ్య ఆ మాటలు చెబుతోంటే, కుటుంబరావు గారంటే ఎంత అభిమానమో ఆ కళ్ళలో స్పష్టంగా కనుపించింది. బావ ఏం మాట్లాడకుండా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

బన్నూ, చిన్నూ, నేనూ పెరట్లోకి వచ్చేశాం మొక్కలకి నీళ్ళుపోద్దామని. కాస్సేపటిలో బన్నూ లోపలికి వెళ్ళబోయి ఆగిపోయింది. నా దగ్గరికి హడావుడిగా వచ్చి "పిన్నీ మనింటికి పోలీసులొచ్చారు" అంది గుసగుసగా మొహం భయంగాపెట్టి.

"నిన్న చిన్నూ ఒకమ్మాయి పెన్సిలు తెచ్చేసింది మనింటికి. అందుకే వచ్చారేమో? చిన్నూను పట్టుకుపోతారా?"

ఆ మొహంలోని భయం చూస్తోంటే నాకు నవ్వొచ్చింది. కానీ ఆపుకుంటూ నేను బన్నూలానే భయం నటించాను.

"అమ్మో, అయితే ఇపుడెలా? బన్నూను ఎక్కడ దాచేద్దాం?" అన్నాను తమాషాగా.

"అలా కాదు. ఆయనకి దండంపెట్టి 'మా చిన్నూకి తెలియక తెచ్చింది. ఇంకెప్పుడూ అలా చేయదు. వదిలిపెట్టండి' అనడుగుదాం" అంది అమాయకంగా.

నాకు చాలా ఆశ్చర్యమనిపించింది, ఆ నిజాయితీకి.

"గుడ్! అవును అలాగే చేయాలి. నేను తప్పుగా చెప్పాను" అంటూ బన్నూను ముద్దుపెట్టుకున్నాను మురిపెంగా

నేనూ లోపలికి తొంగిచూశాను. యూనిఫారమ్‌లో ఉన్నారు. ఎవరో పోలీసు ఆఫీసర్లే అయ్యుంటారు. బావతో హాల్లో కూర్చుని మాట్లాడుతున్నారు. అక్క కూడా అక్కడే ఉంది.

పది నిముషాల్లోనే వాళ్ళు వెళ్ళిపోయారు.

"బావ ఫ్రెండ్సా, వాళ్ళు ఎందుకు వచ్చారు?" వంట గదిలో పని చేసుకుంటున్న అక్క పక్కన కూర్చుని అడిగాను.

అక్కయ్య భారంగా నిట్టూర్చింది.

"మేము ఈ ఇంటికి రాకముందు ఇంకొకచోట ఉండేవాళ్ళం గదా. అక్కడ మా పక్కింటాయన భార్య ఆత్మహత్య చేసుకుంది అప్పుడు. ఆమె నా ఫ్రెండని ఆ విషయం గురించి నన్ను అడగటానికి వచ్చారు."

"ఆత్మహత్యా? కట్నం గొడవలేనా? వివరంగా చెప్పక్కా" ఆసక్తిగా అడిగాను.

"విశ్వంగారి భార్య పద్మావతి అప్పుడప్పుడూ నా దగ్గిరకు వచ్చి కూర్చునేది. నేను కొన్న వీక్లీలవీ తను పట్టుకెళ్ళేది. తను కొన్నవి నాకు ఇస్తూండేది. భార్యాభర్తలు బాగానే ఉండేవాళ్ళు కానీ ఏవో చిన్న చిన్న సమస్య లుండేవి. అందరిళ్ళలోనూ ఉండేవే. విశ్వంగారికి స్వంత ఊళ్ళో ఒక ఇల్లుంటే దాన్ని అమ్మేశారు మంచి బేరం వచ్చిందని, ఆ డబ్బుతో ఆయన పెదనాన్న కొడుకులతో కలిసి రైస్‌మిల్ లీజ్‌కి తీసుకుని బిజినెస్ మొదలుపెట్టారు. అది పద్మకిష్టం లేదు. పద్మా వాళ్ళదీ ఊరే. వాళ్ళ నాన్నగారితో బిజినెస్ చేయమని పోరుపెట్టినా విశ్వంగారు వినలేదు. పద్మ అక్కా, బావా కూడా వాళ్ళమ్మ గారింటి పక్కనే ఉంటారు. పద్మ బావ మావగారితోనే కలిసి బిజినెస్ చేస్తున్నాడు. పద్మ అప్పుడప్పుడూ అంటూండేది 'మా బావ మా అక్క ఎలా చెబితే అలా వింటాడు. ఈయన ఏ విషయంలోనూ నా మాట వినరు' అని.

వాళ్ళమ్మ గారింటి పక్కనే ఓ ఇల్లు ఖాళీ అయితే, అక్కడికి మారదామని గొడవ పెట్టింది పద్మ. దగ్గర వాళ్ళకి కొంచెం దూరంగానే ఉండాలని ఆయన సిద్ధాంతం అట. అందుకని దానికీ ఒప్పుకోలేదు. ఇలాంటి విషయాలకే తను నా దగ్గిర బాధపడుతూంటే, నేను చెప్పేదాన్ని 'ఆయన అభిప్రాయాలు, ఇష్టాలు వేరుగా ఉండొచ్చు కదా! సర్దుకుపోవాలి కానీ, సమస్యల్ని పెంచుకుని బాధపడటమెందుకు' అని.

ఆ రోజు పద్మ వాళ్ళమ్మగారింటికి వెళ్ళింది. విశ్వంగారి తల్లి కూడా వాళ్ళతో పాటే ఉండేది. విశ్వంగారు ఆవిడని కళ్ళ డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళారు, ఆమె చూపించుకోవాలంటే. డాక్టరుకి చూపించుకున్నాక పక్కనే ఎవరో బంధువులుంటే, అక్కడ కొంచెంసేపు ఆమె ఉంటాననంటే వదిలి పద్మా వాళ్ళమ్మ గారింటికి వెళ్ళారు.

ఈయన వెళ్ళేసరికి అక్కడ బట్టలషాపు అతను వచ్చి ఉన్నాడట. అతను వెళ్ళబోతూ విశ్వంగారు ఎదురయ్యేసరికి బాకీ వీలైనంత తొందరలో నర్దమని అడిగారట. విశ్వంగారికి తెలియదని అతనికి తెలియదు.

పద్మ అంతకు రెండు నెలల క్రితం ఎవరో బంధువుల పెళ్ళి కని తన అక్కావాళ్ళు కొనుక్కుంటూంటే, తనూ మూడు వేలు పెట్టి ఓ పట్టుచీర కొందట అరువుపెట్టి. ఎప్పుడో విశ్వంగారికి మెల్లగా చెప్పి తీర్చవచ్చులే అనుకుంది.

అరువుపెట్టి కొనాల్సినంత అవసరమేమిటని విశ్వంగారికి కోపం వచ్చింది. అరువు బేరాలు తనకి నచ్చవని అక్కడే చిరాకు పడ్డాడట. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఇంటికి వచ్చారు. పద్మని ఇంటిదగ్గర దింపి తల్లిని తీసుకురావటానికి ఆయన వెళ్ళారు.

సరిగా అప్పుడే నేను వాళ్ళింటికి వెళ్ళా. పద్మ అదో మాదిరిగా ఉంది. ఆవేశంతో, కోపంతో ఆవిర్లు వస్తున్నట్లుగా ఉంది. జరిగిందంతా తనే చెప్పింది బాధపడుతూ. అమ్మ గారింట్లో అందరిముందూ అవమానం జరిగినట్లు బాధపడింది. నేను అనునయంగా నాలుగు మాటలు చెప్పబోతోంటే వినిపించుకోలేదు.

“చూస్తూ ఉండండి. నేను ఈ తల్లీ కొడుకులకు ఎలా బుద్ధి చెబుతానో మీరే చూస్తారుగా” అంది రోషంతో బుసలు కొడ్తూ.

నేను ఇంటికి వచ్చేశాను.

కాసేపటిలోనే ఊరి నుంచి మన పాలేరువచ్చాడు జున్ను తీసుకుని.

పద్మకి చాలా ఇష్టం. కొంచెం ఇచ్చివద్దామని గిన్నెలోపెట్టుకుని వెళ్ళాను. ఎంత తట్టినా తలుపు తీయలేదు. ఇంతలోనే విశ్వంగారూ, అతని తల్లీ వచ్చారు. విశ్వంగారు వెనుకవేపుకి వెళ్ళారు. నేను గిన్నెను పద్మ అత్తగారి చేతికిచ్చి వచ్చేశాను. నేను ఇంట్లోకి వస్తూండగానే వాళ్ళింటి నుంచి పెద్దగా ఏడుపులు వినిపించేసరికి గాభరాగా మళ్ళీ వెళ్ళాను.

పద్మ ఉరిపోసుకుని చనిపోయింది! నేను నిర్ఘాంతపోయాను! ‘వీళ్ళకెలా బుద్ధి చెబుతానో మీరే చూస్తారుగా’ అంటే ఏమిటో అనుకున్నాను గానీ అంత ఘోరం చేస్తుందనుకోలేదు! పద్మకి ఆరేళ్ళ కూతురు ఉంది. అప్పుడు కాన్వెంట్‌కెళ్ళింది. కన్నకూతురుపైన మమకారం అయినా పద్మని బంధించలేకపోయింది.

ఆశ్చర్యం ఏమిటంటే, ఒ కుర్రాడితో వాళ్ళమ్మగారింటికి పద్మ ఓ చీటీ పంపిందట అందులో ‘ఈ ఇంట్లో భర్తా, అత్తలతో నాకు శాంతి సుఖంలేవు’ అంటూ రాసిందట. దాంతో పెద్దగొడవైంది.

పద్మ అత్తగారు చాలా సౌమ్యురాలు. ఏ విషయంలోనూ ఎప్పుడూ కల్పించుకునేది కాదు. ఆమె పల్లెటూళ్ళోనే ఉంటానని అన్నా, ఒక్కతే అక్కడ ఎందుకని విశ్వంగారే తీసుకువచ్చారట. అదీ పద్మ కిష్టంలేదు. విసుక్కుంటూనే ఉండేది ఆ విషయంలోనూ తన మాట వినలేదని.

విశ్వంగారిని అరెస్టు చేశారు – పద్మచావుకి అతను పెట్టిన చిత్రహింసలే కారణమని! చిన్నపిల్ల ఉందని ఆయన తల్లిని వదిలిపెట్టారు. పద్మ చిన్న విషయానికి మూర్ఖంగా ప్రాణాలు తీసుకుంది. కక్షతో భర్తని జైలుకి నెట్టింది. అతను తనేమీ హింసలు పెట్టలేదని అంటూంటే ఎవరు నమ్మటంలేదు. పద్మ ఆరోజు నాతో అన్నమాటలు విశ్వంగారు వాళ్ళకి చెప్పి నా సాక్ష్యం తీసుకోమని చెప్పినట్లున్నారు. అందుకే ఎస్.ఐ. వచ్చారు."

అక్కయ్య చెప్పింది వింటోంటే, నాకు ఆశ్చర్యంతో నోటమాట రాలేదు కాసేపటివరకూ, ఇలాంటి ఆడవాళ్ళు కూడా ఉంటారా? ఇది ఎవరైనా చెబితే నేను నమ్మేదాన్ని కాదు. ఇంకా ఏదో జరిగి ఉంటుంది పైకి రానివ్వలేదేమో అనుకునేదాన్ని. అక్క స్వయంగా చూసింది కాబట్టి గానీ లేకపోతే నమ్మదగ్గ సంగతిలా లేదు.

కన్నకూతురు మీద మమకారాన్ని, ఎనిమిదేళ్ళ వైవాహిక అనుబంధాన్ని ఫణంగా పెట్టి భర్తమీద కోపంతో ప్రాణాల్ని తీసుకోవటమా? ఎంత మూర్ఖత్వం!

"పోనీలే అక్కా, నీ సాక్ష్యంతో పాపం ఆ విశ్వంగారి కేసు తేలికవుతుందిగా?" అన్నాను.

"సరేలే? అవన్నీ వాళ్ళకి చెప్పాననుకుంటున్నావా? మనకెందు కొచ్చింది ఈ పోలీసులతో గొడవ! మనల్ని మధ్యలో తిప్పి చంపుతారు. కోర్టుకి రమ్మంటారు. మనకేమి తెలియదంటే ఒక మాటతో తీరుపోతుంది. నేను ఇరుగూ పొరుగూ అందరితో కలిసి చనిపోయిన రోజు చూసి వచ్చానే కానీ నాకేం తెలియదని చెప్పాను."

ఇదేమిటి? ఒక నిరపరాధి జీవన్మరణ సమస్యతో జైల్లో ఉంటే, కోర్టుకు తిరగాల్సి వస్తుందనే కారణంతో సాక్ష్యం చెప్పకపోవటమా? ఘోరం కాదూ?!

అక్కయ్యతో అదే అంటే, "చిన్నదానివి, నీకేం తెలుసు, ఇలాంటి వ్యవహారాలు ఎంత చిరాకో!" అనేసింది.

నా మనసెందుకో గిజగిజలాడినట్లుగా అయిపోయింది. బావ అయినా ఎలా ఊరుకున్నాడు? నేను అక్కయ్యతో వాదించబోతోంటే. "నీ కెందుకే ఈ అనవసర విషయాలు? నోర్మూసుకో" అని కసిరింది వినిపించుకోకుండా.

ఆ రాత్రి హాస్టలులో పక్క మీద పడుకున్నా అర్ధరాత్రి దాటేవరకూ నిద్రపట్టలేదు. అక్కయ్య చెప్పిన విషయాలే మనసులో వలయాల్లా తిరుగుతున్నాయ్.

జైలులో కటకటాల వెనుక... కన్నపిల్లకీ, ముసలితల్లికీ దూరమై, భార్య మూర్ఖత్వంతో, తాత్కాలిక ఆవేశంతో విధించిన శిక్షననుభవిస్తూన్న ఒక నిరపరాధి విషాద వదనం నా కళ్ళ ముందు మాటిమాటికీ కనిపించసాగింది. అక్కయ్య సాక్ష్యం తన విడుదలకి ఉపకరిస్తుందని ఎంతగా ఎదురు చూస్తున్నాడో! అక్కయ్య చెప్పలేదని తెలిస్తే ఎంత క్రుంగిపోతాడో, మరెంతగా ఆశ్చర్యపోతాడో! అప్రయత్నంగా నా కళ్ళు చెమ్మగిల్లాయ్.

ఆ తరువాత నేను రెండు ఆదివారాలు అక్కావాళ్ళింటికి వెళ్ళటం కుదరలేదు వర్కు ఉండటంతో.

ఆ రోజు నేను వెళ్ళేసరికి అక్కయ్య బావతో ఏదో మాట్లాడుతోంది. గొంతు గాద్గదికంగా ఉంది. నేను వెళ్ళగానే బావ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అక్క కళ్ళలో చిప్పిలుతున్న నీళ్ళు!

"ఏమైందక్కా?" ఆదుర్దాగా అడిగాను.

బావ తన ఉద్యోగ ధర్మాన్ని నిజాయితీగా నిర్వర్తించే మనిషి. పై ఆఫీసరు లంచాలు తీసుకుని రికమెండ్ చేసినవి రూల్సుకి వ్యతిరేకంగా ఉంటే బావ ప్రతిఘటించేసరికి, బావంటే ఆయనకి పడటంలేదట. అందుకని బావనే ఇరికిస్తూ, ఆయన పైకి తప్పుడు రిపోర్టు పంపించాడట. ఎంక్వయిరీ జరుగుతోంది. అదీ విషయం.

"ఏదో ఘోరం జరిగిపోతుందని నేను బాధపడటం లేదు. నా బాధంతా కుటుంబరావు అన్నయ్య చేసిన పని గురించే, ఆఫీసుకి వచ్చిన అన్నయ్యని ఎంక్వయిరీకి వచ్చిన వాళ్ళకి తన గురించి చెప్పమని మీ బావ అడిగితే, 'అలాగే' అని చెప్పకుండా వెళ్ళిపోయాడట. పై ఆఫీసరుతో గొడవ వస్తుందేమో తన పనులు కావేమొ అనే స్వార్థంతో మొహం చాటేశాడన్న మాట! ఎంతో అభిమానం చూపిస్తూ, 'చెల్లెమ్మా' అని నోరారా పిలిచే మనిషి అలా ప్రవర్తించేడంటే, నేను నమ్మలేకపోతున్నా!

ఆ ఆఫీసరుకి వ్యతిరేకమవుతానేమోననే భయంతో మనకి జీవనాధారమైన ఉద్యోగం పోతుందేమో అనే ఆలోచన లేకుండా, తనకి నిజాయితీగా ఎంతో సాయం చేసిన మనిషికి అనుగుణంగా నోటిమాట చెప్పటానికి కష్టకాలంలో మొహం చాటేస్తాడా?! మనుషులింత అన్యాయంగా ప్రవర్తించగలుగుతారంటే నేను నమ్మ..." మాటల్ని మధ్యలో ఆపేసి ఆలోచనలోపడి అక్క రెండు నిముషాలు అలాగే ఉండిపోయింది.

ఆ తర్వాత ఏదో నిర్ణయించుకున్న దానిలా ఫోను దగ్గరికి వెళ్ళి డయల్ చేస్తోంది. నాకేం అర్థం కాలేదు. మాటల మధ్యలో ఏం గుర్తుకొచ్చిందని, ఫోను చేస్తోంది? ఎవరికసలు?

"హలో... పోలీసుస్టేషనేనా? ఎస్.ఐ. గారున్నారా? మీరేనా? నమస్కారం. నేను మిసెస్ రాజారావుని మాట్లాడుతున్నాను. మీరు మా ఇంటికి వచ్చినప్పుడు... అదే విశ్వంగారి కేసు గురించి, ఆరోజు నాకు తెలిసిన విషయాలు చెప్పలేకపోయాను. కేవలం ఎందుకొచ్చిన గొడవఅనే. ఇప్పుడది చాలా అన్యాయం. అనిపించింది నాకే. అందుకే మీకు ఫోను చేస్తున్నా. నాకు తెలిసిన విషయాలు మీకు చెబుతాను. అలాగే..."

అప్పుడర్థమైంది నాకు... అక్క వైపు ఆనందంగా, ఆరాధనగా చూశాను.

తనదాకా వస్తే కానీ తెలియదంటా రిందుకే కాబోలు! కనీసం అప్పుడయినా అక్క తను చేసిన పొరపాటును గుర్తించటం, సరిదిద్దుకోవాలనుకోవడం నాకు గొప్ప విషయంగా అనిపించింది!

తమకి ఇతరుల వల్లన జరిగిన అన్యాయానికి బాధపడతారే కానీ తమ వల్ల ఇతరులకి కలిగిన అన్యాయాన్ని ఎవరూ గుర్తించటానికి ఇష్టపడరు. అలాంటి ఆలోచనే రాదు చాలామందికి.

ఆరోజు నేను చెప్పబోతోంటే 'నీకేం తెలుస'ని అక్కయ్య వినిపించుకోలేదసలు. ఇప్పుడు తను చేసిన పని ఎలాంటిదో గ్రహించకలిగింది. ఎవరికైనా స్వానుభవమే మంచి గురువు కాబోలు!

ఆంధ్రప్రభ వీక్లీ. 9, మార్చి, 1988.